సాక్షి పెద్దపల్లి

బుధవారం । 24 । జనవరి । 2024



భక్తులకు చలువపందిళ్లు

వేములవాడ: సమ్మక్క జాతర, మహాశివరాత్రి సమీపిస్తుండటంతో రాజన్న దర్శనానికి భక్తులు తరలివస్తున్నారు. దీంతో అధికారులు మంగళవారం నుంచి ఆలయ ఆవరణలో చలవపందిళ్లు వేయిస్తున్నారు.



సమ్మె విరమణ

సిరిసిల్లటౌన్: రెండ్రోజులుగా సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు మంగళవారం విరమించినట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్ తెలిపారు. సమస్యలను ఆర్నెళ్లలోపు పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
32.0 /21.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వగలు ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయిలో రాణించండి



విజేతల వివరాలు వెల్లడిస్తున్న డీఈవో

పెద్దపల్లిరూరల్: జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనల్లో సత్తాచూపిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రదర్శనల్లోనూ ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తేవాలని జిల్లా విద్యాధికారి మాధవి సూచించారు. జిల్లాస్థాయి పోటీల్లో విజేతల వివరాలను మంగళవారం జిల్లా కేంద్రంలో వెల్లడించారు. శాస్త్ర, సాంకేతికత అంశంగా ఐదు ఉప అంశాల్లో విద్యార్థులు ప్రతిభను చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు తోపాటు సమన్వయకర్త, ఉమ్మడి పరీక్షల బోర్డు సహకార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

విభాగాలను పటిష్టం చేయాలి



వినతిపత్రం అందిస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణిలోని నాలుగు విభాగాలను పటిష్టం చేయాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. మంగళవారం డైరెక్టర్(పా) ఎన్వీకే శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనేక ఏళ్ల చరిత్రకలిగిన సింగరేణి రూ.33వేల కోట్ల టర్నోవర్, రూ.2,222 కోట్ల లాభాలతో 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తోందన్నారు. కానీ, కొన్ని విభాగాల పనితీరు సరిగా లేదన్నారు. ముఖ్యంగా, పర్సనల్, లా(న్యాయ), ఎస్టేట్, మెడికల్ డిపార్ట్‌మెంట్ల పనితీరు మెరుగుపర్చాల్సి ఉందని అన్నారు. అతిప్రధానమైన ఈవిభాగాల పనితీరు సరిగా లేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే సంస్థ పనులు కూడా పెండింగ్‌లో ఉంటున్నాయని ఆయన వివరించారు.

'మిషన్ భగీరథ నీళ్లు ఏవి?'



నిరసన తెలుపుతున్న స్థానికులు

పెద్దపల్లిరూరల్: రూ.కోట్లు వెచ్చించి ఇంటింటికీ తాగునీరు అందిస్తామని చెప్పినా ఇప్పటికీ చుక్కనీరు రావడం లేదని మున్సిపల్ 9వ వార్డులోని చీకురాయిరోడ్డు, చైతన్యకాలనీ, ఇస్లాంపుర కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. చీకురాయి రోడ్డు కాలనీలకు మిషన్‌భగీరథ నీళ్లు సరఫరా చేయాలని కాలనీవాసులు మస్తానీ, భారతమ్మ, సాజియా, కనకమ్మ, జుబేర్, సాగర్, కిరణ్, సత్తయ్య, సురేశ్, శంకరయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు కాలనీలో మంగళవారం నిరసన తెలిపారు. మిషన్‌భగీరథ పైప్‌లైన్ వేసిన అధికారులు.. తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. కొందరు నల్లాలకు విద్యుత్ మోటార్లను అమర్చుకుంటున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కుళాయిల ద్వారా మిషనల్ భగీరథ నీటిని సరఫరా చేయాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నేడు ఉద్యోగ మేళా

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఖాజాజహీర్‌అహ్మద్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఐసీఐసీ, యాక్సిస్, యూనిటీ, యస్‌బ్యాంక్, టైమ్స్ పీఆర్వో, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల్లో పలు ఉద్యోగాల కోసం అర్హులను ఎంపిక చేస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగి 26ఏళ్లవయసు ఉండాలన్నారు. అర్హులు బుధవారం ఉదయం 10గంటలకు తమ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని వారు కోరారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అవిశ్వాసంపై 3న సమావేశం

సుల్తానాబాద్(పెద్దపల్లి): కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసుపై ఫిబ్రవరి 3న స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ఈవిషయాన్ని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతపై అవిశ్వాసం ప్రకటిస్తూ 11మంది కౌన్సిలర్లు ఇప్పటికే కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చిన విషయం విదితమే. అయితే, ఫిబ్రవరి 3న ఉదయం 11గంటలకు జరిగే బలప్రదర్శనకు కౌన్సిల్ సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఆయన సూచించారు.

ఊరిస్తున్న నామినేటెడ్

- త్వరలో భర్తీ చేస్తారనే సంకేతాలు
- ఉత్సాహంలో ఆశావహులు
- పదవులు తక్కువ.. పోటీ ఎక్కువ
- మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసు కోసం తీవ్రప్రయత్నాలు
- జిల్లాస్థాయి పదవులు, మార్కెట్ కమిటీలకు ఫుల్ డిమాండ్



సాక్షి, పెద్దపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కొలువుదీరాక నామినేటెడ్ పదవులన్నింటినీ రద్దుచేసింది. గత ప్రభుత్వం నియమించిన వారందరినీ తొలగించింది. త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతుండటంతో నాయకులు, ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. రోజులు గడిచిన కొద్దీ ఆ పదవులకు డిమాండ్ పెరుగుతోంది. సంక్రాంతి పండుగకే నామినేటడ్ పోస్టులు భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా.. దావోస్ పర్యటన ముగించుకుని వచ్చాక వీలైనంత త్వరగా పదవులు భర్తీ చేస్తారనే సంకేతాలు వస్తున్నాయి. దీంతో ఆశావహుల్లో సందడి మొదలైంది. ఏ పోస్టుకు ఎవరెవరు పోటీ పడుతున్నారు, ఎప్పటిలోగా భర్తీ చేస్తారు? భర్తీ చేస్తారా? లేదా? అనేది కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ కలిగిస్తోంది. నామినేటెడ్ పోస్టుల భర్తీ ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయొచ్చని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

పదవులు దక్కుతాయనే ఆశలో..

- ఆదినుంచీ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో ఉన్న సాన్నిహిత్యం, ఎమ్మెల్యేల అండదండలతో పలువురు నాయకులు నామినేటెడ్ పోస్టులు ఎలాగైనా దక్కించుకోవాలని ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు.
- పలువురు సీనియర్ నేతలు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల కోసం ప్రయత్నిస్తుండగా, మరికొందరు జిల్లాస్థాయి పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారు.
- నామినేటెడ్ పోస్టుల భర్తీలో పార్టీ ఏ అంశాన్ని ప్రాతిపదికగా తీసుకుంటుందనేదానిపై జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నేతల భవితవ్యం ఆధారపడి ఉంది.
- ఆదినుంచీ పార్టీలో పనిచేస్తున్నవారు, వివిధ పార్టీల నుంచి ఎన్నికల ముందు, ఆ తర్వాత పార్టీలో చేరినవారు, వివిధ జేఏసీల్లో క్రియాశీలకంగా పనిచేస్తూ తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన వారు పదవులు తమకు దక్కుతాయనే విశ్వాసంతో ఉన్నారు.

ఆశవాహుల జాబితా పెద్దదే..

- నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య జిల్లాలో చాంతాడంత ఉంది. పెద్దపల్లి నుంచి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, గోపగాని సారయ్య, సయ్యద్ మస్రత్, అన్నయ్యగౌడ్, మినుపాల ప్రకాశ్‌రావు, గీట్ల రాజేందర్‌రెడ్డి, భూషణవేని రమేశ్‌గౌడ్, ఎలువాక రాజయ్య, రేగుంట అశోక్, డి.దామోదర్‌రావు, ఎల్.జలపతిరెడ్డి, మెండే పోచాలు, సాంబిరెడ్డి, బైరి రవిగౌడ్, పుప్పాల శంకర్, గట్టుయాదవ్, ఈర్ల సురేందర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, బూతగడ్డ సంపత్, గుండేటి అయిలయ్య యాదవ్, కట్ట నరేంద్రాచారి, శ్రీమాన్, కొండి సతీశ్, చీటీ సతీశ్‌రావు, కల్లెపల్లి జానీ, మాదాసు వెంకన్నపటేల్, చిలుక సతీశ్, వేగోళం అబ్బయ్యగౌడ్ పదవులు ఆశిస్తున్నారు.
- మంథని నుంచి గంట వెంకటరామణారెడ్డి, శశిభూషణ్ కాచె, తోట చంద్రయ్య, అరెపల్లి కొమురయ్య, ఇనుముల సతీశ్, ఒడ్నాల శ్రీనివాస్, తొట్ల తిరుపతియాదవ్, ఉప్పట్ల శ్రీనివాస్, నాగినేని జగన్మోహన్‌రావు, చొప్పరి సదానందం నామినేటెడ్ పోస్టుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.
- రామగుండం నుంచి ఏఐసీసీ నేత గుమ్మడి కుమారస్వామి, బాబర్ సలీం పాషా, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాశ్, నూర సమ్మయ్య తదితరులు పదవులు ఆశిస్తున్నారు. అయితే పార్టీ అధిష్టానం ఎవరిని కరుణిస్తుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ప్రసన్నం కోసం ప్రయత్నాలు - తలలు పట్టుకుంటున్న ఎమ్మెల్యేలు

పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల్లోని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పదవుల కోసం ఆశావహులు ఎవరికివారే ముఖ్య నేతలను కలుస్తూ ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో కొందరు నాయకులు ముందస్తుగానే మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే అభ్యర్థులతో ఒప్పందం కుదుర్చుకుని కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేశారు. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారుఅధిక సంఖ్యలో ఉండడంతో ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నారు. పదవులు తక్కువ సంఖ్యలో ఉండడం, ఆశావాహులు పదుల సంఖ్యలో ఉండడంతో ఎవరికి పదవి ఇస్తే ఏం జరుగుతుందోననే డైలామాలో పడిపోతున్నారు. నామినేటెడ్ పదవి కోసం ఆశావాహులు ఎమ్మెల్యేలను కలుస్తుండడంతో చేసేది లేక చూద్దామంటూ నేతలు చెబుతూ వస్తున్నారు.

'దళితబంధు' అందని ద్రాక్షేనా?

- 1,020 మందికి పూర్తిస్థాయిలో అందని నిధులు
- హుజూరాబాద్‌లో 8వేల మందికిపైగా ఎదురుచూపులు
- రూ.290 కోట్లు ఖాతాలో ఉన్నా డ్రా చేసుకోలేని వైనం
- నిధులిస్తే వ్యాపారాలు వృద్ధి చేసుకుంటామని వినతి
- వెంటనే మంజూరు చేయాలని లబ్ధిదారుల డిమాండ్



యూనిట్లు అందిస్తున్న గంగుల కమలాకర్(ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో దళితుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి మార్చేందుకు గతప్రభుత్వం ప్రారంభించిన దళితబంధు పథకం నిలిచిపోయింది. లబ్ధిదారుల ఖాతాల్లో పథకానికి సంబంధించిన రూ.లక్షల్లో డబ్బులు ఉన్నా.. వాటిని డ్రా చేసుకోలేని విచిత్ర పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పథకం కోసం లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.290 కోట్లు వేసినా.. ఆ డబ్బులు ఎండమావులవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021 ఆగస్టు 16న హుజూరాబాద్ మండలం శాలపల్లి గ్రామంలో అప్పటి సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా పథకం ప్రారంభించారు. దళితుల జీవన స్థితిగతులు పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం దళితబంధుకు శ్రీకారం చుట్టినట్లు ప్రకటించారు. ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా దళిత ప్రభుత్వ ఉద్యోగులకు సైతం ఈ పథకం వర్తింపజేశారు. హుజూరాబాద్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించి, నియోజకవర్గంలో సర్వేచేసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. దాదాపు 18,031 మందికి పథకాన్ని వర్తింపజేశారు. లబ్ధిదారులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో రిటైల్, డెయిరీ, చిన్న పరిశ్రమలు, షాపులు, ప్రింటింగ్, బ్యాగుల తయారీ తదితర స్వయం ఉపాధి కార్యక్రమాలకు వేదికగా మారింది.

రెండు రకాలుగా పథకం అమలు

రాష్ట్రంలో దళితబంధును రెండు రకాలుగా అమలు చేశారు. తొలుత హుజూరాబాద్ తరహాలో కొన్ని ప్రాంతాలు ఎంపిక చేసుకుని ఆ ప్రాంతంలో ఉండే దళితులందరికీ పూర్తిస్థాయిలో పథకం అమలు చేయడం. దీన్ని సాచురేషన్ మోడ్ అంటారు. రెండోది రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ప్రతీ నియోజకవర్గాల్లో 1,100 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించి వారితో వ్యాపారాలు చేయించడం. దీన్ని టార్గెట్ మోడ్ అంటారు. పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో టార్గెట్ మోడ్ విధానంలో పథకాన్ని అమలు చేశారు. కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్‌లో సాచురేషన్ మోడ్‌లో, మిగిలిన నియోజకవర్గాల్లో టార్గెట్ మోడ్ అమలు చేశారు.

నిధులకు కటకట

18వేలమందిలో మెజారిటీ లబ్ధిదారులకు రూ.10లక్షలకు మించి అప్పుడే అందజేశారు. వీరిలో అత్యధికంగా జేసీబీ, లారీ, ట్రక్కు, వరినాటు యంత్రాలు, ఆటోలు, కార్లు తదితర వాహనాలు ఎంపిక చేసుకున్నారు. తర్వాత పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేశారు. వాహనాలకు ప్రాధాన్యం తగ్గించి వ్యాపారాలను ప్రోత్సహించారు. అందులో రూ.5లక్షలు తొలుత ఇచ్చి, అవసరాన్ని బట్టి వ్యాపార విస్తరణకు తగిన కారణాలు చూపించిన వారికి ఇస్తూ పోయారు. ఈ లెక్కన ఇప్పటి వరకు హుజూరాబాద్‌లోని ఇల్లందకుంట, హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక మండలాల్లో 6,868మంది, కమలాపూర్ మండలంలో 1,280 మందికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదు. మొత్తంగా హుజూరాబాద్‌లో 8,148 మందికి, మిగిలిన ఉమ్మడి జిల్లాలో 1,020 మందిని కలిపితే.. 9,168 మంది ఇంకా పథకంలో రెండో విడత కింద ఉన్న రూ.290 నిధుల విడుదల అనుమతి కోసం చకోర పక్షుల్లా ఎదురుచూస్తున్నారు.

పథకంపై నీలి నీడలు

సరిగ్గా ఎన్నికలు సమీపించే సమయానికి ప్రభుత్వం వద్ద నిధులకు కటకట ఏర్పడింది. అందుకే, దళితబంధుకు ఎంపికైన పలువురు లబ్ధిదారులకు రూ.2 లక్షలు, రూ.3 లక్షల చొప్పున ఇచ్చి సర్ది చెప్పారు. మరికొన్ని చోట్ల రూ.10లక్షలను ఐదుగురికి పంచిన సందర్భాలు కూడా ఉన్నాయని పలువురు వాపోతున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వీరందరికీ ఖాతాల్లో వేసిన డబ్బులు డ్రా చేసుకునేందుకు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఎన్నికల అనంతరం అనుమతి వస్తుంది అనుకున్నా. ఇంతవరకూ ఈ పరిస్థితి లేకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. అసలు పథకం అమలు అవుతుందా? లేదా అన్న సందిగ్ధం నెలకొంది.

	లబ్ధిదారులు	నిలిచిపోయింది	ఫ్రీజైనవి (రూ.లక్షల్లో)
కరీంనగర్	210	04	3.50
జగిత్యాల	345	24	46.37
పెద్దపల్లి	259	14	60.28
రాజన్నసిరిసిల్ల	206	55	80.48
హుజూరాబాద్	18,031	8,194	273.59(కోట్లు)

రెండో విడత ఇవ్వలేదు



మేము అరుగురం కలిసి ఒకఫర్మ్‌గా ఏర్పడి కోళ్ల ఫారం పెట్టుకున్నాం. మొదటి విడతలో ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున వచ్చాయి. రెండో విడుత డబ్బులు ఇవ్వలేదు. ఇప్పటికీ రేకుల షెడ్డు పూర్తి అయ్యింది. అప్పటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ కూడా వచ్చి పరిశీలించారు. రెండో విడుతా తొందరగా విడుదల చేయాలి. ఈ విషయం పై అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– శ్రవణ్, చల్లూర్, వీణవంక మండలం

దళిత బంధు ఇవ్వాలి



దళిత బంధ్ కోసం దరఖాస్తు చేసుకున్నాం. మంజూరైనట్లుగా బుక్, మెసేజ్ వచ్చింది. బుక్ లో అమౌంట్ క్రెడిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. కానీ బ్యాంకుకు వెళ్లి అధికారులను అడిగితే అమౌంట్ హోల్డ్‌లో ఉందని తెలిపారు. దళితబంధు డబ్బులు అందించాలని కోరుతున్నాను.

– రాచపల్లి రాజశేఖర్, విలాసాగర్, జమ్మికుంట

ధరణి సమస్యలకు పరిష్కారమేది?

- హైకోర్టు న్యాయవాది సాధిక్‌అలీ, బీఎస్పీ నేత ఉష



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది సాధిక్

పెద్దపల్లిరూరల్: రైతులు భూసంబంధిత సమస్యలతో సతమతమవుతున్నారని హైకోర్టు న్యాయవాది సాధిక్ తెలిపారు. గత బీఆర్ఎస్ సర్కార్ అమలు చేసిన ధరణిసమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సాధిక్ ఫౌండేషన్, దాసరి పద్మ, హనుమయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సాధిక్ మాట్లాడారు. ధరణి పోర్టల్ సమస్యలను గుర్తించేందుకు సదస్సులు నిర్వహించి ఆధారాలు సేకరించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ ధరణి సమస్యలు పరిష్కరించేలా ఏర్పాటు చేసిన కమిటీకి నివేదిక అందించామని పేర్కొన్నారు. నయాపైసా ఖర్చులేకుండానే పరిష్కారం చూపే అవకాశం ఉందని, ఈ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం అర్హులైన పేదల భూహక్కులను ఏ ఆధారం లేకుండానే ఇతరుల పేరిట బదిలీ చేయడంతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డీవీఎస్ మూర్తి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, భూపోరాట సమితి నాయకుడు గూళ్ల రాజు, బీసీ సంక్షేమ సంఘం నేత సిరవేణ స్వప్న పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి చెక్

- జిల్లాలో సర్వీస్ మీటర్ల ఆకస్మిక తనిఖీ
- సీళ్లు పరిశీలిస్తున్న ప్రత్యేక బృందాలు
- డొమెస్టిక్ కనెక్షన్లతో కమర్షియల్ విద్యుత్ వినియోగం
- పలువురికి నోటీసులు జారీచేసిన ట్రాన్స్‌కో అధికారులు



పెద్దపల్లిరూరల్: జిల్లాలో విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు ట్రాన్స్‌కో అధికారులు రంగంలోకి దిగారు. సర్వీసు మీటర్ల సీళ్లు తొలగించి చౌర్యానికి పాల్పడుతున్నారనే సమాచారంతో జిల్లావ్యాప్తంగా ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. జిల్లాలో 2,32,735 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇంకా కొందరు వినియోగదారులు మీటర్ కనెక్షన్ తీసుకోకుండానే నేరుగా కరెంట్ వినియోగిస్తున్నారు. ఇందులో డొమెస్టిక్, కమర్షియల్ వినియోగదారులు ఉన్నారు.

అనుమతికి మించి వినియోగం..

- అవసరాల కోసం పొందిన అనుమతికి మించి కస్టమర్లు విద్యుత్ వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.
- వచ్చే వేసవిలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు తనిఖీలు దోహదపడతాయని ఓ అధికారి తెలిపారు.
- ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ పడకుండా అడిషనల్ ఇంప్రూవ్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చేందుకు చర్యలు తీసుకోనున్నామని పేర్కొన్నారు.

269 మంది వినియోగదారులకు నోటీసులు

పెద్దపల్లిలో 9,660 విద్యుత్ మీటర్లను తనిఖీ చేయగా అందులో వివిధ కారణాలతో నిబంధనలను పాటించని 269 మంది వినియోగదారులకు నోటీసులు జారీచేశారు. వారినుంచి రూ.7.20లక్షల జరిమానా వసూలు చేయనున్నట్లు ఓ అధికారి పేర్కొన్నారు. గృహ అవసరం కోసమని కనెక్షన్ పొంది, దానినుంచి వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నట్లు కూడా గుర్తించారు. అలాంటి కనెక్షన్ సర్వీసుల కేటగిరీ మార్చుకోవాలని వినియోగదారులకు సూచించారు.

ఇంటికో విద్యుత్ కనెక్షన్

- ప్రతీఒక్కరు తమ ఇంటికి తప్పనిసరిగా విద్యుత్ కనెక్షన్ పొందాలి.
- ప్రభుత్వం అమలు చేయనున్న గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనుంది.
- ప్రజాపాలనలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా అర్హులెవరో గుర్తించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.
- ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన వారు కుల ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే కనెక్షన్‌తోపాటు ప్రతినెలా 100 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పొందే అవకాశం కూడా ఉంటుందని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

సకాలంలో బిల్లులు చెల్లించాలి

విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలి. ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను అర్హులందరికీ అందేలా చూస్తాం. కొత్త కనెక్షన్లు అవసరం ఉన్న వారు తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే రాయితీ వర్తిస్తుంది. విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా చట్ట పరమైన చర్యలు ఉంటాయి.

– బొంకూరి సుదర్శనం, ఎస్ఈ

పంట పొలాల్లో పులి సంచారం?

- భయాందోళనలో పల్లెవాసులు

ముత్తారం(మంథని): మచ్చుపేట గ్రామ పంచాయతీ పరిధి శుక్రవారంపేట శివారు రామగిరిఖిలా సరిహద్దు పంట పొలాల్లో పులి సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రధానంగా రైతు కాంపెల్లి సారయ్య పొలంలో పులి అడుగుల ఆనవాళ్లు కనిపించాయని వారు తెలిపారు. రామగిరిఖిలా సరిహద్దు ప్రాంతంలోని పొలాల్లో పులి సంచరించిన అడుగుల ఆనవాళ్లు మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో రామగిరిఖిలా సమీప శుక్రవారంపేట, లక్కారం, మచ్చుపేట తదితర గ్రామాల ప్రజలు, రైతులు భయాందోళనలకు గురవుతున్నారు.

20న జింక కళేబరం లభ్యం

రామగిరిఖిలా సరిహద్దు పొలాల్లో ఈనెల 20న జింక కళేబరం కనిపించిందని గ్రామస్తులు తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈనెల 21న అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతంలో పరిశీలన చేశారు. కుక్కల దాడిలో జింక మృతిచెందిందని పేర్కొంటూ కళేబరాన్ని కాల్చివేశారని, పులి దాడి చేయడంతోనే జింక చనిపోయిందని చెప్పినా అధికారులు వినలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

సుమారు మూడేళ్ల తర్వాత..

2020 సెప్టెంబరు 6న మచ్చుపేట బగుళ్ల గుట్టలో పులి దాడిలో ఆవు మృతి చెందిన విషయం విదితమే. మళ్లీ సుమారు మూడేళ్ల తర్వాత రామగిరిఖిలా ప్రాంతంలోని వ్యవసాయ పొలాల్లో పులి సంచరించిందనే వార్త స్థానికుల్లో వణుకు పుట్టిస్తోంది. ఈ విషయంపై పెద్దపల్లి అటవీ రేంజర్ నాగయ్య మాట్లాడుతూ, రైతులు చూసిన వన్యప్రాణి అడుగులు హైనావి అయి ఉండొచ్చన్నారు. దీనిపై బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించాక వివరాలు తెలియజేస్తామని తెలిపారు.



వన్యప్రాణి పాదముద్రికలు

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

- కాయల్ప బృందం ప్రతినిధులు



వివరాలు తెలుసుకుంటున్న కాయకల్ప బృందం

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఆస్పత్రి, పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండాలని కాయకల్ప బృందంలోని డాక్టర్ సునీతరాణి అన్నారు. కాయకల్ప బృందంలోని సభ్యులు క్రిస్టియన్, మనోజ్‌కుమార్, నహీంతో కలిసి మంగళవారం ఆమె స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సందర్శించారు. పేషెంట్లకు అందిస్తున్న సేవలు, సిబ్బంది తీరుపై ఆరా తీశారు. ఆ తర్వాత ఆస్పత్రి మొత్తం కలియ తిరిగారు. బయో మెడిసిన్, నిల్వలు, స్టెరిలైజేషన్, హైజనిక్ కిట్స్, లేబర్ రూమ్ తదితర వాటి నిర్వహణపై ఉద్యోగులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పేషెంట్లతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయని పేషెంట్లు చెప్పడంతో ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. క్వాలిటీ కంట్రోలర్ అధికారి అనిల్‌కుమార్, సుల్తానాబాద్ డీడీవో డాక్టర్ రమాదేవి, హెడ్ నర్సులు రాణి, మంజుచౌదరి, స్టాఫ్‌నర్సులు నర్సమ్మ, రేవతి, సునీత, సరిత, కనకతార, సిబ్బంది చారి, జుల్‌ఫక్కర్, నరేశ్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

- బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గోదావరిఖని: పేదల సంక్షేమం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం స్థానిక విఠల్‌నగర్‌లో సంక్షేమ పథకాల ప్రచార వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. భారతప్రధాని నరేంద్రమోదీ మహిళల కోసం ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారని, 55 కోట్ల మందికి ఆయుష్మాన్‌భవ పేరిట రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నారన్నారు. నాలుగు కోట్ల పక్కా గృహాల నిర్మాణం, దేశంలో 88 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ఆయన ధీమావ్యక్తం చేశారు. నరేంద్రమోదీ సారథ్యంలో మూడోసారి కూడా బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మామిడి రాజేశ్, మాతంగి రేణుక, అడ్డురి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదాలు నియంత్రించాలి



గనిలోకి వెళ్తున్న నాయకులు

గోదావరిఖని: భవిష్యత్‌లో బొగ్గు గనుల్లో ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. మంగళవారం ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–2ఏ గనిలో ప్రమాదం జరిగిన స్థలాన్ని గుర్తింపు కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. సోమవారం మొదటి షిఫ్ట్‌లో జరిగిన గని ప్రమాదంలో మైనింగ్ సర్దార్ మందల సమ్మిరెడ్డి తీవ్ర గాయాలపాలైయ్యారని తెలిపారు. సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ఆరెల్లి పోశం, ఎస్.వెంకట్‌రెడ్డి, పర్లపెల్లి రామస్వామి, నాగేందర్, వెంకన్న తదితరులు గనిలోకి వెళ్లి ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. నాయకులు ఉన్నారు.

సింగరేణి అధికారులతో పర్సనల్ జీఎం సమీక్ష



మాట్లాడుతున్న జీఎం హనుమంతరావు

రామగిరి(మంథని): ఉద్యోగ విరమణ పొందిన ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు 11వ వేజ్ బోర్డు వేతనాలపై పర్సనల్ జీఎం బి.హనుమంతరావు అన్ని ఏరియాల పర్సనల్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు బకాయి వేతనాలు అందించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అందుకు రిటైర్డ్ ఉద్యోల అర్హతలు, నిబంధనలు సరిచూసుకోవాలని ఆయన చెప్పారు. త్వరితగతిన ఈప్రక్రియ పూర్తి చేసేలా ప్రణాళి రూపొందించుకోవాలని ఆదేశించారు. రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో కాయిలు చెల్లిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. ఈమేరకు పర్సనల్ విభాగంలోని అందరు ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవో రాజేశం, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి

- మిగిలింది 56రోజులే
- ఏరియాల వారీగా పర్యటిస్తున్న డైరెక్టర్లు



ఓసీపీ-3లో కార్మికుడితో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

గోదావరిఖని: సింగరేణి బొగ్గుకు డిమాండ్ పెరిగింది. దేశవ్యాప్తంగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరిపడా బొగ్గు అందించాలనే ఒత్తిడి ఇప్పటి నుంచే పెరుగుతోంది. వచ్చే వేసవిలో విద్యుత్ డిమాండ్ అధికం కానుండడంతో అన్ని విద్యుత్ సంస్థలు అప్రమత్తమవుతున్నాయి. నిర్దేశిత లక్ష్యాల మేరకు వినియోగదారులకు బొగ్గు అందించాలని కేంద్రప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తున్నాయి. ఈక్రమంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరాంతోపాటు డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్‌వీకే శ్రీనివాస్, సత్యనారాయణరావు నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనపై దృష్టి సారించారు. ఈఆర్థిక సంవత్సరానికి మరో 56రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో 23మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని, రక్షణ విషయంలో అన్నిచర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

ఓసీపీలపై ప్రత్యేక దృష్టి..

- సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి 80శాతానికిపైగా ఓసీపీల ద్వారా వస్తోంది.
- ఈక్రమంలో సంస్థవ్యాప్తంగా అన్ని ఓసీపీలపై యాజమాన్యం దృష్టి సారించింది.
- ఉత్పత్తికి అనుకూలమైన సమయం కావడంతో సంస్థ సీఎండీ, డైరెక్టర్లు ప్రతీరోజు సమీక్షలు నిర్వహిస్తూనే ఏరియాల వారీగా పర్యటిస్తున్నారు.
- వార్షిక లక్ష్యాల సాధనకోసం తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తున్నారు.

భూగర్భ గనుల్లో నష్టాల రికవరీపై ఫోకస్

సంస్థలోని 22 భూగర్భ గనుల్లో సాధ్యమైనంత వరకు నష్టాలు తగ్గించాలనే యోచనలో యాజమాన్యం ఉంది. ప్రధానంగా యాంత్రీకరణ గనుల్లో బొగ్గు ఉత్పత్తి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో అన్ని ఏరియాల జీఎంలకు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. ఓసీపీల్లో భారీగా లాభాలు వస్తుండగా, భూగర్భగనుల్లో టన్ను బొగ్గు ఉత్పత్తిపై రూ.8వేలకు పైగా నష్టం వస్తోందని, దానిని తగ్గించేందుకు ఉత్పత్తి పెంచాలని సూచిస్తున్నారు. మరో రెండు నెలల సమయం ఉండటంతో పక్కా ప్రణాళికతో యాజమాన్యం ముందుకు సాగుతున్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యం(మిలియన్ టన్నుల్లో)	
2023-24 ఉత్పత్తి లక్ష్యం	74
జనవరి 21నాటికి సాధించాల్సింది	54.08
సాధించిన బొగ్గు ఉత్పత్తి	51.86
నిర్దేశిత లక్ష్యాల్లో సాధించిన శాతం	96

సమస్యలు పరిష్కరించండి

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రిజర్వాయర్‌లోని ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్టపరమైన ప్రయోజనాలు, అలవెన్సులు చెల్లించాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కార్మికులతో కలిసి కూనమనేని టెక్నాలజీ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ కాంట్రాక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ, రామగుండం సోలార్ ప్రాజెక్ట్ నిర్మించినప్పటి నుంచి నేటివరకూ సుమారు 100 మందికిపైగా కార్మికులు మాడ్యూల్ క్లీనింగ్, ఫ్యాబ్రికేషన్, కేబుల్ వర్క్స్, టెక్నీషియన్లు, ఫెర్రస్ సిమెంట్ వర్క్, బోట్ ఆపరేటర్లుగా ఇతర పనులు చేస్తూ విద్యుత్ ఉత్పత్తిలో పాల్గొంటున్నారని తెలిపారు. వారి శ్రమకు తగిన ఫలితాలు అందడం లేదన్నారు. పని నైపుణ్యాలను గుర్తించి వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రతినెలా 10వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, వాహనాల పార్కింగ్ షెడ్లు నిర్మించాలని సూచించారు.

ఎన్టీపీసీ వైఖరి మారకుంటే ఆందోళనలు

- నిరుద్యోగుల ఉపాధి దెబ్బతీయొద్దు
- స్థానిక టిప్పర్లకే బూడిద కేటాయించాలి
- టిప్పర్ అసోసియేషన్ ప్రతినిధుల డిమాండ్
- ఐదురోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు
- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన ప్రతినిధులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు



యాష్‌పాండ్ వద్ద టిప్పర్ కార్మికుల నిరసన దీక్షలు

రామగుండం: యాష్‌పాండ్ నుంచి బూడిద లోడింగ్‌కు స్థానిక టిప్పర్లకు అనుమతి ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని టిప్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హెచ్చరించారు. ఈవిషయంలో ఎన్టీపీసీ తీరు మారకుంటే ప్రత్యక్ష పోరాటం తప్పదన్నారు. ఈమేరకు ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి బూడిద లోడింగ్ అనుమతులు స్థానిక టిప్పర్లకు అప్పగించాలని కోరుతూ శ్రీరామ లారీ, యాష్ టిప్పర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైదరాబాద్‌లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఎన్టీపీసీ అధికారులతో సంప్రదింపులు జరిపి స్థానిక టిప్పర్లకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్టీపీసీ యాజమాన్యం బూడిద లోడింగ్ అనుమతులను స్థానికేతరులకు అప్పగిస్తోందన్నారు. ప్రధానంగా ఇటుక బట్టీల యజమానులకు బూడిద తరలించుకునే లోడింగ్ అనుమతులు ఇచ్చిందని, దీంతో వారు తమ సొంత వాహనాల్లో బూడిద తరలించుకు పోతున్నారని తెలిపారు. స్థానిక టిప్పర్లపై ఆధారపడిన నిరుద్యోగులకు ఉపాధి కరువైందని ఆవేదన చెందారు. అదేవిధంగా సింగరేణి భూగర్భ గనుల్లో ఫిల్లింగ్ చేసేందుకు ఎన్టీపీసీ బూడిదను తమ సొంత వాహనాల ద్వారా తరలిస్తూ పలువురు టిప్పర్ యజమానులు బూడిదను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా బూడిద చెరువుతో వాతావరణ కాలుష్యం పెరిగి స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. అయినా, ఎన్టీపీసీ యాజమాన్యం స్పందించడం లేదని దుయ్యబట్టారు. ఎన్టీపీసీ ఇదే వైఖరిని అవలంబిస్తే ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. స్థానికేతర టిప్పర్లను బూడిద చెరువులోకి వెళ్లకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన ప్రతినిధులు వారిలో బడికెల రాజశేఖర్, సంపంగి శ్రీనివాస్, శివరాత్రి గంగాధర్, కనకరాజు, శేఖర్, సుమన్, కొమురయ్య తదితరులున్నారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పీటీఎస్‌లో కారు ఢీ కొన్న ఘటనలో మహిళకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని ఓ పాఠశాలకు చెందిన గోడ నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో కూలీ పనులు చేసుకునే కుంతీ(47) మంగళవారం పనులు ముగిశాక అక్కడ సేద తీరుతున్న క్రమంలో ఓ కారు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఆమె చేతికి, తలకు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కాంట్రాక్టు కార్మికుడికి..



గాయపడ్డ కార్మికుడు

రామగిరి(మంథని): ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏ గనిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుడు మంగళ్ సింగ్ ప్రమాదంలో గాయపడ్డాడు. మంగళవారం విధులు నిర్వహిస్తుండగా రోప్ నుంచి హాంగ్లర్ మీదపడటంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే తోటి కార్మికులు గమనించి కమాన్‌పూర్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

యువకుడి ఆత్మహత్య



సల్మాన్ (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): మంచిర్యాలకు చెందిన సల్మాన్(30) ఆత్మహత్య చేసుకున్నాడు. గోదా వరిఖని వన్‌టౌన్ ఎస్సై స్వామి కథనం ప్రకారం.. సల్మాన్ మంచిర్యాలకే చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఆమె నిరాకరించడంతో సోమవారం గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నాడు. కాసేపటికే క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన స్థానికులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదావరి నదిలో దూకిన యువకుడు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని తిలక్ నగర్‌కు చెందిన ఎండీ.అజీముద్దీన్ అనే యు వకుడు గోదావరి నదిలో దూకగా గల్లంతయ్యాడు. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. అజీముద్దీన్ మంగళవారం మధ్యాహ్నం గోదావరి బ్రిడ్జి వద్ద కు బైక్ వచ్చాడు. వంతెన పైనుంచి నదిలో దూకిన ట్లు డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. సీఐ అఫ్జలొద్దీన్, ఎస్సై మధుసూదన్ జాలర్ల సహాయంతో గాలి ంచినా అజీముద్దీన్ ఆచూకీ లభించలేదు. కాగా, అతను కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారు సాయిబాబా ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రమాకాంత్ కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తలుపులు బద్దలు కొట్టి, లోనికి ప్రవేశించారు. హుండీలోని రూ.10 వేలతోపాటు రెండు పంచలోహ, సాయిబాబా ఇత్తడి, ఆవుదూడ విగ్రహాలతోపాటు ఒక గంటను ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ.20 వేల వరకు ఉంటుంది. ఆలయ వాచ్‌మెన్ మరాఠి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి

ధర్మారం(ధర్మపురి): కటికెనపల్లి గ్రామానికి చెందిన మస్కం లక్ష్మి(70) వ్యవసాయ బావిలో పడి మృతిచెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. లక్ష్మి మంగళవారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆమె కుమారుడు రమేశ్ పొలం వద్దకు వెళ్లి, వెతికాడు. కనిపించకపోవడంతో బావిలో చూడగా లక్ష్మి మృతదేహం కనిపించింది. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిందని అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పొలం వద్ద రైతు..

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన తంగెళ్ల చంద్రయ్య(59) అనే రైతు తన వ్యవసాయ పొలం వద్ద మృతి చెందాడు. ఎస్సై విజేందర్, బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. చంద్రయ్య సోమవారం సాయంత్రం కదంబపూర్ శివారులోని తన పొలం వద్దకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో ఆయన కుమారుడు వెతుక్కుంటూ వెళ్లాడు. పొలం వద్ద అపస్మారక స్థితిలో ఉన్న తండ్రిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు. చంద్రయ్య నోటినుంచి నురగ రావడంతో విషపురుగు కుట్టిందా? లేదా క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో 'అల్లూరి'..

మల్యాల(చొప్పదండి): మండల ప్రజలు పెద్ద పటేల్ అంటూ ఆత్మీ యంగా పిలుచుకునే మల్యాలకు చెందిన అల్లూరి నర్సింహారెడ్డి అనా రోగ్యంతో మంగళవారం మృతిచెందారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. మల్యాల పంచాయతీ సమితి అధ్యక్షుడి కాలం నుంచి నర్సింహారెడ్డితో నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందని ఎమ్మెల్సీ గుర్తు చేసుకున్నారు.

రెండు రేషన్ దుకాణాలు సీజ్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రేగడిమద్దికుంటలో రెండు రేషన్ దుకా ణాలను మంగళవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. డీలర్ రఘుపతి గ్రామంలో దుకాణం నిర్వహించడంతోపాటు మరో షాప్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు వచ్చాయి. తనిఖీ చేయగా రెండు దుకాణాల్లో కలిపి 44 క్వింటాళ్ల బియ్యం తేడా వచ్చింది. దీంతో ఆ షాపులను సీజ్ చేశామని తహసీల్దార్ పేర్కొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులపై అవగాన

- రైతు వేదికల్లో ఎల్ఈడీ టీవీల ఏర్పాటు
- నియోజకవర్గానికో కేంద్రం కేటాయింపు



ఎంపికైన గుండారం రైతువేదిక

పెద్దపల్లిరూరల్: రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, మెలకువలపై అవగాహన కల్పించేందుకు అధికార యంత్రాంగం సాంకేతిక పద్ధతుల గురించి వివరిస్తోంది. ఇందుకోసం సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రతీక్లస్టర్ పరిధిలోని రైతువేదికలో ఎల్ఈడీ టీవీ బిగించాలని నిర్ణయించింది. ఈమేరకు జిల్లా వ్యవసాయ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

అవగాహన కోసమే..

- ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని రైతువేదికలో ఎల్ఈడీ టీవీ, ఇతర పరికరాలు ఏర్పాటు చేయాలని అధికారులు, పాలకులు నిర్ణయించారు.
- వీటి ద్వారా ఆధునిక సాగు పద్ధతులపై రైతుల్లో అవగాహణ పెంచాలని ప్రణాలిక రూపొందించారు.
- సాగులో పాటించాల్సిన మెలకువలను శాస్త్రవేత్తలతో వివరించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.
- ఇందులో ప్రధానంగా రసాయనాల వినియోగం తగ్గించి తక్కువ పెట్టుబడి అధిక దిగుబడి సాధించేలా అన్నదాతలకు అవగాహన కల్పిస్తే ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశముంటుందనేది వారి లోచన.
- వ్యవసాయశాఖ అమలు చేసే పథకాలతో రైతుల్లో వ్యక్తమయ్యే సందేహాలను సైతం ఇందులో నివృత్తి చేసుకోవచ్చు.

జిల్లాలో మూడు ఏర్పాటు..

జిల్లాలో మూడు అసెంబ్లీ (పెద్దపల్లి, మంథని, రామగుండం) నియోజకవర్గాలు ఉన్నాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు కానుండడంతో జిల్లాకు మూడు కేంద్రాలు ఆధునీకరణకు నోచనున్నాయి. మంథని అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కమాన్‌పూర్ మండలం గుండారం క్లస్టర్ రైతువేదికలో ఇప్పటికే పరికరాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అక్కడ పనులు పురోగతిలో ఉన్నాయి. అలాగే పెద్దపల్లి అసెంబ్లీ పరిధిలో సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి, రామగుండం సెగ్మెంట్ పరిధిలో పాలకుర్తిలో ఈ దృశ్య, శ్రవణ కేంద్రాల ఏర్పాటుకు వ్యవసాయాధికారులు ప్రతిపాదించారు. ఈ పనులు కూడా త్వరలోనే ప్రారంభం కానున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

రైతులకు మేలు

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రైతువేదిక భవనాన్ని దృశ్య, శ్రవణ కేంద్రంగా ఆధునికీకరించడంతో రైతులకు ఎంతోమేలు జరుగుతుంది. అన్నదాతలు తమకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. సాగు పద్ధతులు, చీడపీడల నియంత్రణ, సస్యరక్షణ చర్యలపై అవగాహన పెంచుకోవచ్చు. ఈ కేంద్రాలతో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు తెలుసుకుని దిగుబడులను పెంచుకునేందుకు వీలుంటుంది.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

యువత భవిష్యత్‌కు బాటలు వేయాలి



మాట్లాడుతున్న యాదవరాజు

జ్యోతినగర్(రామగుండం): భావితరానికి యువత బాటలు వేయాలని నేషనల్ యూత్ ప్రాజెక్టు రాష్ట్ర అధ్యక్షుడు కె.యాదవరాజు కోరారు. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనిలోని విశ్వభారతి హైస్కూల్‌లో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. తొలుత ఆయన సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వివేకానంద జయంతి నుంచి నేతాజీ జయంతి వరకు నేషనల్ యూత్ ప్రాజెక్టు యువజన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. చదువుతోపాటు విజ్ఞానం, సంస్కారం నేర్చుకోవాలని యువతకు సూచించారు. ప్రముఖ న్యాయవాది అమరేందర్ రావు విద్యార్థులకు సందేశం ఇచ్చారు. విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



లీకేజీలతో అవస్థలు



మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీతో ఆ దారంతా నీటితో నిండిపోయింది. రాకపోకలకు కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. వాహనదారులు, విద్యార్థులు బురద నీటిలోనే వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయంపై అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. వారంరోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి లీకేజీలు అరికట్టాలని పెద్దపల్లిలోని 22వ వార్డు వాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

అప్పు తిరిగి చెల్లించాలని గొడవ

- మనస్తాపంతో మహిళ ఆత్మహత్య



మణెమ్మ మృతదేహం

గోదావరిఖని(రామగుండం): అప్పు తిరిగి చెల్లించాలని గొడవ చేశారని మనస్తాపంతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుందని గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. తిలక్‌నగర్ చెందిన జంగ మణెమ్మ(39) తన చిన్న కూతురు వివాహం కోసం కొన్నేళ్ల క్రితం ఎన్టీపీసీ గౌతమినగర్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.10 లక్షలు అప్పు తీసుకుంది. అప్పటినుంచి ప్రతినెలా వడ్డీ చెల్లిస్తోంది. అయితే, ఈ నెల 22న తాను అప్పుగా ఇచ్చిన డబ్బులు చెల్లించాలంటూ సదరు వ్యక్తి ఆమె ఇంటికి వచ్చి, గొడవ చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన మణెమ్మ మంగళవారం క్రిమిసంహారక మందు తాగింది. ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్‌లు ఢీ : ముగ్గురికి తీవ్ర గాయాలు



గాయపడిన విజయ్, అభిలాష్, మల్లేశం



సిరిసిల్ల క్రైం: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సిరిసిల్ల పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని అనంతనగర్‌కు చెందిన మల్లేశం మంగళవారం రాత్రి పొలం పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో పెద్దూరు డబుల్ బెడ్‌రూం ఏరియాకు చెందిన విజయ్, అభిలాష్ బైక్‌పై వేములవాడ వెళ్తున్నారు. సిరిసిల్ల–వెంకటాపూర్ బైపాస్ రోడ్డుపై రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ, బైక్ ఢీకొని యువకుడికి...

వేములవాడరూరల్: లారీ, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వేములవాడ రూరల్ ఎస్సై మారుతి వివరాల ప్రకారం.. వేములవాడ పరిధిలోని నాంపల్లికి చెందిన నాగారపు ప్రశాంత్ మంగళవారం నల్లగొండ నుంచి వేములవాడకు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో ఫాజుల్‌నగర్ వద్ద వేములవాడ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.